క్లుప్తంగా

బిషప్‌కు ఘనంగా సత్కారం



రత్నప్రభు దంపతులను సత్కరిస్తున్న సంఘం సభ్యులు

ఇల్లెందు: ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ద్వారా వరల్డ్ టీచర్స్ డే అవార్డు అందుకున్న ఇల్లెందుకు చెందిన బిషప్ తాళ్లూరి రత్నప్రభు దంపతులను ఇల్లెందు ఏరియా క్రిస్టియన్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆదివారం సత్యనారాయణపురం చర్చిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 7వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఇల్లెందు అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బోధకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం గోవిందాపురం గ్రామంలో రాత్రి ఓ ప్రార్థనా మందిరాన్ని దుండగులు ధ్వంసం చేశారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

తైక్వాండో క్రీడాకారుడికి అభినందనలు



ప్రశాంత్‌పాల్‌ను అభినందిస్తున్న నిర్వాహకులు

కొత్తగూడెంటౌన్: ఈ నెల 9, 10, 11 తేదీల్లో నిజామాబాద్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 తైక్వాండో స్టేట్ లెవల్ కాంపిటేషన్‌లో కొత్తగూడేనికి చెందిన పెండెం ప్రశాంత్‌పాల్ ప్రతిభ చూపి సిల్వర్ మెడల్ సాధించారు. ఈ మేరకు ఆదివారం నిర్వాహకులతో పాటు పలువురు క్రీడాకారులు ప్రశాంత్‌పాల్‌ను అభినందించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎండీ మక్బుల్, ఎల్.రమేష్‌కుమార్, కోచ్ యాకుబ్ పాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు సాయం చేయరూ..



మంచానికే పరిమితమైన రోహిత్

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ గ్రామానికి చెందిన బల్లెం రాజు, సరోజ దంపతులకు లేకలేక కలిగిన ఒక్కగానొక్క కుమారుడు రోహిత్. అతనికి 15 వయస్సు వచ్చినా నేటికీ చిన్నపిల్లవాడి మాదిరిగా సపర్యలు చేస్తున్నారు. మెదడు సంబంధిత వ్యాధి సోకడంతో మతిస్థిమితం కోల్పోయాడు. మెరుగైన వైద్యం అందిస్తే కోలుకుంటామని వైద్యులు చెప్పారు. రోజుకు రూ.10వేలు ఖర్చు చేయాల్సి రావడంతో వారి వద్ద చిల్లి గవ్వలేదు. ప్రస్తుతం వైద్య సేవలు నిలిపివేశారు. దాతలు స్పందించి 9949206367 నంబరుకు ఫోన్‌పే ద్వారా సాయం చేయాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

డ్రెయినేజీ పారేదెలా..?



బోడు రేషన్ షాపు వద్ద డ్రెయినేజీ

టేకులపల్లి: మురుగు నీటి పారుదల కోసం నిర్మించిన డ్రెయినేజీని మూసివేయడంతో మురుగు నీరు పారుదల లేక దుర్వాసనతో జనం ఇబ్బందులు పడుతున్నారు. టేకులపల్లి మండలం బోడు గ్రామంలోని రేషన్ షాపు (జీసీసీ) వద్ద డ్రెయినేజీని మురుగు నీరు పారుదలకు లేకుండా మూసివేశారు. పంచాయతీ కార్యదర్శి స్పందించి డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పత్తి మద్దతు ధర రూ.15వేలుగా ప్రకటించాలి

టేకులపల్లి: పత్తి పంటకు కనీస మద్దతు ధర రూ.15వేలు ప్రకటించాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడుతూ ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు, పెరిగిన ఎరువుల, పురుగుమందుల ధరలు రైతులపై తీవ్రమైన భారం మోపిందన్నారు. ఉత్పత్తి వ్యయాలు అధికంగా ఉండటంతో తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాన్ని గుర్తించి, పత్తికి న్యాయమైన ధర అందించడం ప్రభుత్వ ధర్మమని పేర్కొన్నారు. మద్దతు ధర పెంచక పోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పారిశుద్ధ్యం అధ్వానం

- కార్పొరేషన్ అయ్యాక అధికారుల పర్యవేక్షణ కరువు
- ఎక్కడి చెత్తకుప్పలు అక్కడే



బొల్లేరుగూడెం గ్రంథాలయం రోడ్డు వెంట చెత్త కుప్పలు

పాల్వంచ: మున్సిపల్ కార్పొరేషన్ అయిన తర్వాత పాల్వంచ మున్సిపల్ డివిజన్‌లో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఇక్కడి విధులు నిర్వహించే సిబ్బంది పనితీరు మందగించిందనే విమర్శలొస్తున్నాయి. గతంలో ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీగా ఉన్న పాల్వంచలో పారిశుద్ధ్య చర్యల్లో చిత్తశుద్ధి కరువయింది. ఎక్కడి చెత్తకుప్పలు అక్కడే దర్శనమిస్తున్నాయి. వర్షాకాల సీజన్‌లో చేపట్టాల్సిన ప్రత్యేక చర్యలు ఈసారి మరిచారు. భారీగా వరద నీరు పారే డ్రెయిన్లు శుభ్రం చేయడం, చెత్తచెదారాన్ని తొలగించడం, చెత్తకుప్పలు తీసేయడం వంటి పనులు, స్లమ్ ఏరియాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించడం, బ్లీచింగ్ చల్లడం వంటి పనులు చేయలేదని స్థానికులు వాపోతున్నారు.

పనుల్లో పర్యవేక్షణ కరువు...

డివిజన్ పరిధిలో ఉన్న పారిశుద్ధ్య పనులు నిర్వహణ పర్యవేక్షణ కరువైంది. మొత్తం ఆరుగురు జవాన్లు, ఎనిమిది మంది డ్రైవర్లు, 137 మంది కార్మికులు పనిచేస్తున్నారు. అయితే కార్మికులకు కేటాయించిన పనిని త్వరగా పూర్తి చేయకుండా గంటల తరబడి నాన్చుతూ సమయం దాటవేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంతో పోలిస్తే పనుల పర్యవేక్షణ సక్రమంగా లేదని, జవాన్లు సైతం ఆయా ఏరియాల్లో పనులు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ప్రణాళిక లేకుండా చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. కార్మికులతో పనిచేయించుకోవడంలో సరైన పర్యవేక్షణ లోపించిందంటున్నారు. ఇక శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగ విరమణ చెందగా ఆరు నెలలుగా సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే అధికారే శానిటేషన్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

వీధుల్లో నెలల తరబడి చెత్తకుప్పలు...

డ్రెయినేజీల్లో తొలగించే మురుగును బయటకు తీసి నెలల తరబడి అలాగే వదిలేస్తున్నారు. ఇక ప్రధాన వీధుల్లో సైతం చెత్తకుప్పలు ఎక్కడిక్కడ పేరుకుపోతున్నాయి. చెత్తను ట్రాక్టర్లలో ఎత్తి దానిని



శాస్త్రీరోడ్డులో ఎత్తకుండా వదిలేసిన చెత్త

పట్టణానికి దూరంగా నవభారత్ వెనుక డంప్ చేసేందుకు చాలా సమయం తీసుకుంటుండటంతో పనులు సాగడం లేదు. ఇక పనిచేసే సమయంలో కార్మికులు చిత్తశుద్ధితో పనిచేయడం లేదు. ఇటీవల పండుగల పేరుతో ఆయా మండపాలు ఉండే ఏరియాల్లో పారిశుద్ధ్య పనులకే సమయం కేటాయించారు. దీంతో మిగిలిన ఏరియాల్లో పనులు మందగించాయి. ఈ విషయమై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె.సుజాతను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. ఇన్‌చార్జ్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రవి ప్రసాద్‌ను వివరణ కోరగా.. పారిశుద్ధ్య పనుల్లో పర్యవేక్షణ పటిష్టం చేస్తామని చెప్పారు.

పారిశుద్ధ్య పనులు చేయడం లేదు..



పట్టణంలో పారిశుద్ధ్య పనులు మందగించాయి. చెత్తకుప్పలు నెలల తరబడి తీయడం లేదు. ప్రధాన వీధుల్లోనూ చెత్త కుప్పలు ఎక్కడికక్కడ పేరుకు పోతున్నాయి. డ్రెయినేజీల్లో తీసిన మురుగు సైతం బయట పడేసి, దానిని ఎత్తడానికి నెలల తరబడి రావడం లేదు. – రేగు వెంకటేశ్వర్లు, పాల్వంచ

పర్యవేక్షణ లేదు..



పారిశుద్ధ్య పనుల నిర్వహణలో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. కార్మికులు సకాలంలో పనులు చేయడం లేదు. ప్రణాళికా బద్ధంగా పనులు చేయాల్సి ఉండగా, ముఖ్యమైన ప్రాంతాల్లో సైతం పనులు చేపట్టడం లేదు. అధికారులు స్పందించాలి. – మధుసూదన్, పాల్వంచ

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి..

పాల్వంచ: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.సీతారామయ్య, రాష్ట్ర నాయకుడు గౌని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక నటరాజ్ సెంటర్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన చలో హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం ఎదుట జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు నిధులు కేటాయింపులు చేసి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలిరేట్లు పెంచాలని విన్నవించారు. ఏరియా కార్యదర్శి మంకెన వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు ఎర్నం శ్రీను, భాస్కర్, నరసింహారావు, మల్లేష్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, భిక్షం పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



మాట్లాడుతున్న ఎల్లయ్య

కొత్తగూడెంటౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రాష్ట్ర బాక్సింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు ఎల్లయ్య బండారి అన్నారు. ఆదివారం కొత్తగూడెం ప్రగతిమైదానంతోపాటు, రామవరం త్రీఇంక్లైన్‌లో జరుగుతున్న బాక్సింగ్ క్రీడాకారుల శిక్షణ శిబిరాలను ఎల్లయ్య, జిల్లా బాక్సింగ్ చీఫ్ ప్యాట్రన్, యర్రా కామేష్ సందర్శించారు. బాక్సింగ్ సాధనలో భాగంగా ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులకు మెళకువలు నేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో కొన్ని దేశాలను గుర్తు పెట్టుకోవడానికి కారణం ఆ దేశంలోని క్రీడాకారులు ఆయా క్రీడల్లో రాణించడమేనన్నారు. తల్లిదండ్రులు క్రీడలను నిర్లక్ష్యం చేయకుండా పిల్లలకు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సాహం అందించాలని కోరారు. పిల్లలకు కొత్తగూడెం, భద్రాచలం, రామవరంలలో బాక్సింగ్‌లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, త్వరలో మణుగూరు, ఇల్లెందులలో ఉచితంగా బాక్సింగ్‌లో శిక్షణ తరగతులు ప్రారంభించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సుబ్రహ్మణ్యం, కోచ్‌లు ఈశ్వర్, సాగర్, కిరణ్, శ్రీమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

అనధికార పత్తి కౌంటర్లపై చర్యలు తీసుకోండి..

టేకులపల్లి: మండలంలోని మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో కొందరు వ్యాపారులు విచ్చలవిడిగా పత్తి కొనుగోలు చేస్తున్నారని అనుమతి లేని పత్తి కౌంటర్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌ఎంహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు భూక్యా లాలునాయక్, మండల అధ్యక్షుడు మూడ్ హుస్సేన్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి అప్పులు చేసి పంటలు పండిస్తే రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని వ్యాపారులు తక్కువ ధరలకే కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. దళారుల నుంచి రైతులను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. పత్తికి కనీస మద్దతు ధర.12వేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న లాలునాయక్

15న పర్యావరణ పరిరక్షణ విజ్ఞాన పరీక్ష



విజేతలతో విజ్ఞాన పరీక్ష నిర్వాహకులు

ఇల్లెందురూరల్: 15వ తేదీన కొత్తగూడెం పట్టణంలోని రామవరం స్వర్ణభారతి హైస్కూల్‌లో గోవు పర్యావరణ పరిరక్షణ రాష్ట్ర స్థాయి శాస్త్రీయ విజ్ఞాన పరీక్ష నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ జంతు సంక్షేమ బోర్డు మాజీ సభ్యుడు సతీష్‌ఖండేల్‌వాల్ తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన పరీక్ష విజేతలకు ఆదివారం సుదిమళ్ల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ధృవపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోసేవా విభాగం రాష్ట్ర శాఖ ఆదేశం మేరకు మండల, రాష్ట్ర స్థాయిలలో విజ్ఞాన పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేతలకు ప్రథమ రూ.లక్ష, ద్వితీయ రూ.50వేలు, తృతీయ రూ.25వేలు నగదు, జ్ఞాపిక, ధృవపత్రం అందజేస్తామని వివరించారు. అనంతరం మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన 49 మందికి జ్ఞాపికలు, ధృవపత్రాలను పంపిణీ చేశారు. స్వామి, పూనియా, శిరీష, నాగేశ్వరి, గంగ, సర్వేశ్వరరావు, అబ్దుల్ నయీం పాల్గొన్నారు.

రేపు వాలీబాల్ జట్ల ఎంపికలు

కొత్తగూడెంఅర్బన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్ 17 బాలబాలికల వాలీబాల్ జట్ల ఎంపికలు 14వ తేదీన నిర్వహించనున్నట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 17 క్రీడాకారులు 6వ తరగతి నుంచి ఆపైన చదువున్న వారై ఉండాలని, క్రీడాకారులు మంగళవారం ఉదయం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరగనున్న ఎంపికలకు హాజరు కావాలని కోరారు. స్టడీ సర్టిఫికెట్, ఫొటో, ఎలిజిబిలిటీ ఫామ్‌తో హాజరు కావాలని, వివరాలకు 9951274678 నంబరులో సంప్రదించాలన్నారు.

17న ఆలయ వార్షికోత్సవం

జూలూరుపాడు: మండలంలోని వెంగన్నపాలెం శ్రీదత్తనగర్‌లోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవం 17వ తేదీన జరగనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ 23వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం కాగడ హారతి, మామిడి తోరణాలంకరణ, గణపతి పూజ, సాయిబాబాకు పంచామృతాలతో అభిషేకం, గోత్రనామార్చన పూజలు జరగనున్నట్లు చెప్పారు. కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటలకు నారాయణ సేవ (అన్నదానం) నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, బాబాను దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మున్సిపల్ కార్మికుడు మృతి

ఇల్లెందు: మున్సిపల్ పర్మనెంట్ కార్మికుడు పంబాల ప్రసాద్ (48) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మున్సిపాలిటీలో అకౌంట్ సెక్షన్‌లో పంపు బిల్లులు స్వీకరించే విధులు నిర్వహించే ప్రసాద్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మున్సిపల్ తోటి కార్మికులు, కార్మిక సంఘం నేతలు యాకుబ్‌షావలీ, మల్లెల వెంకటేశ్వర్లు, వేముల గురునాథం, రమేష్, బాలరాజు, గోపీ, భాగ్యమ్మ, ఎస్‌ఐ శ్రీనివాస్ మృత దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాంట్రాక్ట్ కార్మికులకు అందని బోనస్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ 2024–25 లో సాధించిన లాభాల్లో సింగరేణి వ్యాపిత కాంట్రాక్ట్ కార్మికులకు గత నెలలో వారి అకౌంట్లలో రూ.5,500 చొప్పున జమ చేసింది. కానీ కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5 గనిలోని పని చేస్తున్న ప్రైవేట్ ఉత్పత్తి సంస్థ అయిన గెయిన్‌వెల్ కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికులు (40 మందికి) నేటికి లాభాల బోనస్ ఇవ్వకపోవటం గర్హనీయం. కార్మికులు తమ బోనస్ తమకు ఇవ్వమని కోరితే ఇదిగో.. అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని కాంట్రాక్ట్ కార్మికులు వాపోతున్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ రాకపోతే మేనేజ్‌మెంట్‌లో మాట్లాడి ఇప్పించాల్సిన సంఘాల నాయకులు నోరుమెదపక పోవటంలో ఆంతర్యమేమిటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఏరియా ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్ట్ కార్మికులకు అందాల్సిన బోనస్‌ను వెంటనే అందించాలని కోరుతున్నారు.

ఎన్‌ఎండీసీని పునరుద్ధరించండి..

పాల్వంచ: పాల్వంచలోని ఎన్‌ఎండీసీ కర్మాగారాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జాలె జానకిరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి క్యాంప్ ఆఫీస్‌లో పొంగులేటిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్‌ఎండీసీ ప్లాంట్‌కు 450 ఎకరాల స్థలం ఖాళీగా ఉందని, కర్మాగారం మూసివేయడం వల్ల ఉపాధి లేకుండా పోయిందని, ప్లాంట్‌ను పునరుద్ధరించి, అభివృద్ధి చేయాలని కోరారు. స్పందించిన పొంగులేటి మాట్లాడుతూ సీఎండీతో చర్చించి ప్రారంభించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బానోతు బాలునాయక్, యర్రంశెట్టి ముత్తయ్య, బానోతు రాము, సక్రు, రవి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

14న బంద్‌ను జయప్రదం చేయండి..



సమావేశమైన బీసీ సంఘాల నాయకులు

టేకులపల్లి: ఈనెల 14న బీసీల రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని టేకులపల్లి మండల బీసీ సంఘాల నాయకులు ఆదివారం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బంద్ పిలుపుకు మద్దతు తెలపాలని నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించారు.మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలయ్యేలా చొరవ తీసుకోవాలని కోరారు. బంద్ రోజున వ్యాపార, ప్రైవేట్, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు అన్నీ మూసివేయాలని కోరారు. నర్సింగ్ లక్ష్మయ్య, మావునూరి రమేష్, తాడోజు భిక్షమయ్య, గాడేపల్లి రాములు, చిర్రా వెంకటయ్య, డోర్నాల శ్రీను, లక్కినేని వెంకన్న, కట్టు కొజ్వల సురేష్, ఉరిమెళ్ల యాదాచారి, అనంతుల వెంకన్న, పి.హరినాథ్ బాబు, లక్కినేని వెంకటేశ్వర్లు, కే.వెంకటేశ్వర్లు, ఎస్.కోటయ్య పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కార కమిటీ ఏర్పాటు

ఇల్లెందు: ఆదివాసీలు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేసి విసిగిపోయారని, వారి సమస్యల పరిష్కారం కోసం ఒక కమిటీని ఏర్పాటు చేసుకున్నట్లు ఆ సంఘం నాయకులు, తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొగ్గెల రమస్వామి అన్నారు. ఆదివారం ఇల్లెందులో భూ సమస్యలు ఎదుర్కొంటున్న ఆదివాసీలు సమావేశమై తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించుకునేందుకు ఒక సంఘం ఏర్పాటు చేశామని తెలిపారు. ఏజెన్సీలో చట్టాలను తుంగలో తొక్కి ఆర్థిక, రాజకీయ బలంతో ఆదివాసీల భూములు లాక్కుంటున్నారని చెప్పారు. గిరిజనేతరులు, లంబాడీలు, ఫారెస్టు అధికారులు ఆదివాసీలను ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. ఈ భూ సమస్యల పరిష్కార కమిటీలో గౌరవాధ్యక్షుడు గొగ్గెల రామస్వామి, గౌరవ సలహాదారు జార కృష్ణ, అధ్యక్షుడు జోగ రమేష్, ప్రధాన కార్యదర్శి బద్ద శ్రీను, ఉపాధ్యక్షుడు పూనెం కోటయ్య, సహాయ కార్యదర్శి ఇర్ప కోటయ్య, ప్రచార కార్యదర్శి కుంజ వెంకటేష్, కోషాధికారి కుంజ రాములు, ఆర్గనైజర్ కల్తి వినోద్, చీమల అనసూర్య, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



భూ సమస్యల పరిష్కార కమిటీ సభ్యులు

కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాలు



మాట్లాడుతున్న శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికులను పట్టించుకోవటం లేదని, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ ఆరోపించారు. ఆదివారం జిల్లా కమిటీ సమావేశం సీపీఎం కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం నల్లధనం తెచ్చి పేదల బతుకులు మారుస్తారని, జీరో అకౌంట్లు తీసుకోవాలని మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకొని మోసం చేసిందన్నారు. దేశంలో పేదరికం తగ్గిందని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. పేదరికం తగ్గాలంటే ప్రభుత్వం ఉపాధి అవకాశాలు, సొంతిల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సాయం చేయకపోగా ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేస్తామని మాయబాటలు చెప్పి మోసం చేసిందని, ఇందిరమ్మ ఇంటి కోసం ఎదురుచూస్తున్న పేదలకు నిరాశే మిగిలిందన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వేలో వ్యవసాయ కార్మికుల డేటా ప్రకారం అందరికీ ఒకేసారి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నవరపు కనకయ్య, బి.చిరంజీవి, శెట్టి వినోద, నిమ్మల వెంకన్న, ముదిగొండ రాంబాబు, మర్మం చంద్రయ్య, గడ్డం స్వామి, బత్తుల వెంకటేశ్వర్లు, జంగిలి వెంకటరత్నం, ఈసం నర్సింహారావు, బందెల చంటి, లక్ష్మయ్య, రావుజా, తేజావత్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు

ఇల్లెందు: ఇల్లెందు – కొత్తగూడెం ప్రధాన రహదారిలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇల్లెందు సరిహద్దులోని బొజ్జాయిగూడెం స్టేజీ నుంచి 9వ మైలుతండా వరకు రోడ్డంతా గుంతలమయంగా మారింది. నిత్యం వందల లారీలు బొగ్గు, ఇసుక కోసం వెళ్తుండడం వల్ల రోడ్డు మీద గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలకు గుంతల్లో నీరు నిలుస్తోంది. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అటు ఆర్ అండ్‌బీ ఇటు నేషన్ హైవే అధికారులు తక్షణమే మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బొజ్జాయిగూడెం-9వ మైలు తండా రోడ్డు

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



2001-02 బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాల 2001–02 సంవత్సరం బ్యాచ్ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆదివారం జూనియర్ కళాశాలలో గెట్ టూ గెదర్ కార్యక్రమంలో చిన్ననాటి మధుర క్షణాలను నెమరు వేసుకున్నారు. అనంతరం విద్య నేర్పిన గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి కళాశాల ప్రిన్సిపాల్ పరుచూరి వెంకట్రావ్, సాగర్, వేణుగోపాల్, సోమేశ్వరరావు, జగన్, చంద్రశేఖర్, భూపాల్, రాములు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెండెకట్ల యాకయ్య, శోభన్‌బాబు, రాంబాబు, శ్రీను, మధు, విజయ్, సారయ్య, కుమార్, మమత, సమత, శ్రీలత, భాను, మనుసూర్‌బీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.